విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 26, ఆగస్టు 2023

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపడితే అరెస్టు చేస్తారా ?

- అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించాలి
- పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం అలసత్వం
- అక్రమ అరెస్టులను ఖండించిన సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్..

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ గుంతకల్లు పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జగనన్న కాలనీల పేరుతో వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ళ నిర్మాణం తక్షణమే అమలు పరచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ నాయకత్వంలో ఆపార్టీ నాయకులు పేదల పక్షాన పోరాడేందుకు సన్నద్ధమౌతున్న నేపధ్యంలో పోలీసులు అడ్డుకున్నారు.ఈ నేపద్యంలో జిల్లా కేంద్రం నుండి గుంతకల్ బయల్దేరిన సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ను శుక్రవారం ఆయన ఇంటి వద్దే పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సంధర్బంగా జాఫర్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి వెంటనే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.జగనన్న కాలనీల పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణం చేపట్టి నాలుగేళ్లు దాటుతున్నా ఇప్పటి వరకు పేదలకు పక్క ఇళ్ళు పంపిణీ చేసిన దాఖలాలు లేవని ఏకరువు పెట్టారు. పేదల కోసం మంజూరైన జగనన్న ఇళ్ళ పంపిణీ విషయంలో వైసీపీ ప్రభుత్వం అలసత్వం వీడాలని, గత ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన టిడ్కో ఇళ్ళు అర్హులైన వారికి వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ గుంతకల్లులో జగనన్న కాలనీ స్థలంలో ఏర్పాటు చేసిన అర్హుల సమావేశాన్ని పోలీసులు అడ్డుకోవడం ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. ఇది చాలదన్నట్లుగా ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించి ప్రభుత్వం తన నిరంకుశత్వాన్ని మరో సారి బయట పెట్టుకుందని ఘాటుగా విమర్శించారు. గుంతకల్లు ఇళ్ల స్థలాల ప్రాంగణ ప్రాంతంలో పేదల సమావేశాన్ని పోలీసులు ఉద్దేశ పూర్వకంగానే అడ్డు కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఇదిఅన్యాయమన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం జీఓ నెంబర్ వన్ ను విడుదల చేసి అక్రమ అరెస్టులు, గృహ నిర్భంధాలు విపరీతంగా చేశారని గుర్తు చేశారు.అయితే వాటికి వ్యతిరేకంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి , మాజీ ఎమ్మెల్యే రామక్రిష్ణ జీవో నెంబర్ వన్ ను రద్దు చేయాలని హైకోర్టులో పిల్ వేశారని గుర్తు చేశారు. ఈ నేపధ్యంలో జీవో నెంబర్ ఒకటిని హైకోర్టు రద్దు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసిందని అయినా ముందస్తు అరెస్టులు గృహ నిర్బంధాలకు పాల్పడటం సీఎం జగన్ తన నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి జగనన్న కాలనీలు నిర్మాణం చేస్తామంటూ నమ్మబలికి ఇప్పటి వరకు కనీసం లక్ష ఇళ్ళు కూడా పూర్తి చేసిన దాఖలాలు లేవని ఏకరువు పెట్టారు. టీడీపీ హయంలో 80 శాతం పూర్తి అయిన టిడ్కో ఇళ్లు అర్హులకు పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని నాలుగేళ్లుగా జగన్ ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వకుండా చోద్యం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతకల్లు, అనంతపురం, కూడేరు తదితర ప్రాంతాల్లో అర్హులైన నిరుపేదలకు జగనన్న కాలనీల పేరుతో ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపించి పక్కా ఇళ్లు త్వరితగతిన పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నేపధ్యంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యవర్గ సభ్యులు కేశవ రెడ్డి, మల్లికార్జున, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు రామంజినేయులు,నాయకులు మనోహర్, ఖాసీం,ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య ఇతర నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి జాఫర్‌ను పరామర్శించారు.

సమస్యలపై నిలదీత

- రసాబాసగా మండల సర్వసభ్య సమావేశం

అధికారులను నిలదీస్తున్న సభ్యులు

విశాలాంధ్ర-ఉరవకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చంద్రమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. షేక్షానా పల్లి, రేణుమాకులపల్లి గ్రామ సర్పంచులు లింగన్న,బోయ రామాంజనేయులు మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి బోర్లు చెడిపోతే మరమ్మ తులు చేయడానికి కూడా డబ్బులు లేవని నిధులు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటపడిందని ఆరోపిం చారు. అప్పులు చేసుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామని వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గడపగడపకు ప్రోగ్రాం కింద మంజూరైన నిధులకు కూడా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు బిల్లులు మంజూరు కావడం లేదని ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు వన్నూరు సాహెబ్, ఈడిగ ప్రసాద్ మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో తాగునీటి సరఫరా లో తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుందని కొన్ని ప్రాంతాల్లో కలుషితమైన నీటిని సరఫరా చేస్తున్నారని సమావేశం దృష్టికి వారు తీసుకొచ్చారు. మండల సర్వసభ్య సమావేశానికి కొంతమంది అధికారులు హాజరు కాకపోవడం వల్ల కోఆప్షన్ సభ్యులు సలీం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి, సమావేశం నుంచి వాక్ అవుట్ అయి నిరసన తెలిపారు. నేరమెట్ల సర్పంచ్ యోగేందర్ రెడ్డి మాట్లాడుతూ తాగునీరు విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం గ్రామాల్లో అభివృద్ధి కుంటపడుతుందని ఆరోపించారు. ఎంపీపీ చంద్రమ్మ, జడ్పిటిసి సభ్యులు పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, ఎంపీడీవో అమృత రాజు మాట్లాడుతూ సభ్యులు అడిగిన సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని సమావేశాలకు గైరాజరైన అధికారులపై చర్యలు తీసుకునేం దుకు సమావేశంలో తీర్మానం చేస్తున్నట్లు వారు తెలిపారు. సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు రోడ్లు తాగునీరు డ్రైనేజీ వ్యవసాయం, తాగునీరు, జగనన్న గృహ నిర్మాణాలు, తదితర అనేక సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సర్పంచులు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏపీలో ధృతరాష్ట్ర పాలన సాగుతోంది

- ప్రజల కోసం పోరాడితే అరెస్టులు, గృహ నిర్భందాలా..
- ఇదెక్కడి ప్రజా స్వామ్యం సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన కొనసాగుతోందని నిరుపేదల పక్షాన పోరాడితే అక్రమ అరెస్టులు,గృహ నిర్బంధాలు చేస్తున్నారని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు వైసిపి ప్రభుత్వంపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు.ఈ నేపద్యంలో ఆపార్టీ నగర సమితి అధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ నాయకులు కళ్ళకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సంధర్బంగా శ్రీరాములు మాట్లాడుతూ జగనన్న ఇళ్ళు, పెండింగ్ లో ఉన్న టిడ్కో ఇళ్ళ పంపిణీ వెంటనే చేపట్టి పేదోళ్ళ పక్కా ఇళ్ళ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్,జిల్లా కార్యదర్శి జాఫర్ గుంతకల్లులో చేపట్టిన పేద ప్రజల సమావేశాన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.సమావేశానికి వెళ్ళనివ్వ కుండా తమ నాయకులను అరెస్టు చేయాలని పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఆక్రమంలోనే జిల్లా కార్యదర్శి జాఫర్ ను ఆయన నివాసం వద్ద శుక్రవారం పోలీసులు అరెస్టు చేయడాన్ని సీపీఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. నేటి సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు చేశాడని గుర్తు చేశారు.అయితే కంచే చేను మేసిన చందంగా వైసిపి ప్రభుత్వం పేదలకు చెందాల్సిన పక్కా ఇళ్ళ పట్ల అమానుషంగా ప్రవర్తిస్తోందని ఇప్పటి వరకు 80 శాతం పూర్తి అయిన టిడ్కో ఇళ్ళు నాలుగేళ్లుగా జగన్ ప్రభుత్వం పంపిణీ చేయకుండా కాలయాపన చేయడమే ఇందుకు నిదర్శనమని ఏకరువు పెట్టారు. గతంలో టిడిపి ప్రభుత్వం పై వైసీపీ అధినేత జగన్ అనేక నిరసన కార్యక్రమాలు చేశాడని ప్రస్తుతం న్యాయంగా పేదలకు పంపిణీ చేయాల్సిన పక్కా గృహాల పై సీపీఐ పోరాడుతుంటే అడ్డు కోవడం నిరంకుశత్వమే నని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సీఎం జగన్ జగనన్న కాలనీల పేరుతో 32 లక్షల మందికి ఇళ్ళ స్థలాలు కేటాయించి నాలుగేళ్లలో కేవలం 2 లక్షల మందికి కూడా పక్కా ఇళ్ళు కట్టించిన పాపాన పోలేదని మండి పడ్డారు. అంతేకాకుండా పక్కా ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని నమ్మబలికి నేడు కేవలం లక్షా యాభై వేల రూపాయలు మత్రమే ఇస్తున్నారని అందులో రాష్ట్ర ప్రభుత్వం 30 వేలు మాత్రమె ఇస్తోందని ఏకరువు పెట్టారు. అనంతపురం అర్బన్ నియోజక వర్గంలో 30 వేల మందికి పక్కా ఇళ్ళు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన పాలకుల ఆదిశగా చర్యలు చేపట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఉగాది పండుగ లోపు పక్కా ఇళ్ల పంపిణీ చేస్తామని వైసిపి నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి దసరా పండుగ వస్తున్నా చలనం లేకుండా ఉన్నారని ఎద్దేవా చేశారు.

జగన్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాల్సిన పక్కా ఇళ్ళలో కోట్ల రూపాయలు దోపిడీ చేస్తున్నారని సీపీఐ నాయకులు ఘాటుగా విమర్శించారు. పేదల పక్కా ఇళ్ళ కేటాయింపుల విషయంలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యం చెందడంతోనే పుట్టపర్తి,గుంతకల్లు, అనంతపురం తదితర ప్రాంతాల్లో అనేకమంది నిరుపేదలు తమ వద్దకు వస్తున్నారని శ్రీరాములు స్పష్టం చేశారు. పేదల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న తమ నాయకులను జగన్ ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించడం హేయమైన చర్య అని విరుచుకు పడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షాన స్పందించి జగనన్న ఇళ్ళు పూర్తి చేసి అర్హులైన వారికి వెంటనే పంపిణీ చేయాలని , ఇప్పటికే 80 శాతం పూర్తి అయిన టిడ్కో ఇళ్ళు అర్హులైన వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జగన్ ప్రభుత్వంపై ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, రమణ, నగర సహాయ కార్యదర్శి అల్లిపీర,నాయకులు బంగారు బాష, రామాంజనేయులు, చాంద్ బాష, విజయలక్ష్మి, ప్రసాద్,రామయ్య,గాదిలింగ, వెంకటప్ప, ఎఐఎస్ఎఫ్ నాయకులు కుల్లాయ్ స్వామి, రమణయ్య,రాజు, కృష్ణుడు,సూరి పాల్గొన్నారు,

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర-బొమ్మనహాల్: బొమ్మనహాల్ మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళా భక్తులు తమ కుటుంబ సభ్యులతో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ గృహాలలో వరలక్ష్మీ ప్రతిమ ఏర్పాటుచేసి పసుపు, కుంకుమ, గాజులు, రవికలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేమకల్లు ఆంజినేయ స్వామి, ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి, బొమ్మనహాల్ దుర్గమ్మ దేవి, వెంకరమణస్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా జరిగాయి.

తరిమెల బ్రిడ్జి పనులు పరిశీలించిన ఎంపీ

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని తరిమెల గ్రామం నుండి తాడిపత్రి నియోజకవర్గ పెద్దవడుగూరు మండలం చిట్టూరు గ్రామానికి ఎంపీ తలారి రంగయ్య నిధులతో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దా రెడ్డి, వైసిపి నాయకులు తరిమెల వంశీ గోకుల్ రెడ్డితో కలిసి పరిశీలించారు. బ్రిడ్జి పనులు నాణ్యతగా వేగవంతంగా జరగాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధిలు,పార్టీ ముఖ్య నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా
కోనాపురం విద్యుత్ కేంద్రం ముట్టడి

- పంటలు ఎండిపోతున్నా పట్టదా అంటూ రైతుల ఆగ్రహం

విశాలాంధ్ర-ఉరవకొండ: విద్యుత్ కోతలకు నిరసనగా ఉరవకొండ మండలం కోనాపురం విద్యుత్ ఉప కేంద్రాన్ని శుక్రవారం రైతులు ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చిన్న ముష్టూరు, పెద్ద ముష్టూరు, మోపిడి, ఇంద్రావతి గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ బోర్లు,బావులు కింద మరియు హంద్రీనీవా, హెచ్ ఎల్ సి కాలువల నీటి సౌకర్యంతో వేరుశనగ, మిర్చి వరి పంటలను సాగు చేసుకోవడం జరిగిందని అయితే విద్యుత్ కోతలు కారణంగా పంటలు ఎండిపోతున్నాయని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 9 గంటలు విద్యుత్తును అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. గత అనేకమార్లు విద్యుత్ కోతలపై అధికారులు దృష్టికి తీసుకువచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. 9 గంటలు సక్రమంగా విద్యుత్ సరఫరా చేస్తేనే పంటలు పండుతాయని వారు పేర్కొన్నారు. విద్యుత్తు ఉపకేంద్రంలో పనిచేసే సిబ్బంది కూడా సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని విద్యుత్ సమస్యలను చెప్పడానికి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండడం లేదని వారు పేర్కొన్నారు ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నత స్థాయి అధికారులు స్పందించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, అలాగే తొమ్మిది గంటలు నిరంతరాయంగా విద్యుత్తు అందించి పంటలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి

విశాలాంధ్ర-తాడిపత్రి: పెద్దపప్పూరు మండలం పసులూరు గ్రామానికి చెందిన బాలింత జ్యోతి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే అని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కదిరి శ్రీకాంత్ రెడ్డి, మృతురాలి బంధువులు శుక్రవారం మీడియా ముఖంగా వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పసులూరు గ్రామానికి చెందిన గర్భవతి జ్యోతి ఈనెల 18వ తేదీన తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలలో అడ్మిట్ అయ్యారు. వైద్యులు రెండు రోజులు వైద్యం చేసి కడుపులో బిడ్డకు అనారోగ్యంగా ఉందని అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. దీంతో అనంతపూర్ ప్రభుత్వ వైద్యశా లలో ఎమర్జెన్సీగా గర్భవతి జ్యోతి కి సిజరిన్ చేశారు. జ్యోతి ఆడబిడ్డను ప్రసరించింది. బిడ్డ ఆరోగ్యం బాగానే ఉంది. కానీ బాలింత జ్యోతికి అనారోగ్యంగా ఉందని ఎమర్జెన్సీగా కర్నూల్ హాస్పిటల్ కి తీసుకువెళ్లాలని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు వైద్యులు రెఫర్ చేశారు. కర్నూల్ వైద్యశాలలో చికిత్స పొందుతూ బాలింత జ్యోతి మృతి చెందింది. దీంతో బాలింత జ్యోతి బేబీ తల్లి లేని పాపగా మిగిలి పోయిందన్నారు. ఏది ఏమైనప్పటికీ తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందించి ఉంటే బాలింత జ్యోతి నిండు నూరేళ్లు బ్రతికేదని జ్యోతి మృతికి కారకులు వైద్యుల నిర్లక్ష్యమేనని తెలిపారు. కావున ప్రభుత్వం, తాడిపత్రి శాసనసభ్యుడు, మాజీ శాసనసభ్యుడు మృతురాలి బిడ్డను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలింత తండ్రి, మృతురాలి బంధువులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు తగదు

- సిపిఐ తాలూకా కార్యదర్శి జే.మల్లికార్జున

విశాలాంధ్ర-కూడేరు: గుంతకల్లు పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జగనన్న కాలనీల పేరు మీదుగా ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణం తక్షణమే అమలుపరచాలని న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, డి.జగదీష్ నాయకత్వంలో గురువారం డిమాండ్ల పరిష్కారం కొరకు మీటింగ్ పెట్టుకోవడానికి సమాయత్తం అవుతుండగా పోలీస్ వారు పర్మిషన్ ఇవ్వకుండా 144 సెక్షన్ పెట్టారని,.. ఈ కార్యక్రమానికి వస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శిని జాఫర్‌ను కూడా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఏమాత్రం తగదని సిపిఐ తాలూకా కార్యదర్శి జె.మల్లికార్జున అన్నారు. శుక్రవారం వీరి అరెస్టులకు నిరసనగా కోడెల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.గోపాల్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం జీవో నెంబర్ 1(వన్) తీసుకురాగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ హైకోర్టులో పిల్ వేసిన తర్వాత జీవో 1(వన్)ను హైకోర్టు రద్దు చేసిందని, అయినప్పటికీ మందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు 144 సెక్షన్లు పెట్టడం చాలా అన్యాయం దారుణం అన్నారు. దీన్ని సీపీఐ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని, జగనన్న కాలనీలు నిర్మాణం చేస్తామని అంటున్నారే తప్ప ఎక్కడ కూడా కాలనీల నిర్మాణం చేయడం లేదని ఎద్దేవా చేశారు. అర్హులైన పేదలు వందలు వేలమంది ఉంటున్నారు. 80% టిడ్కో ఇళ్లు పూర్తయినా అది కూడా పంపిణీ అరకొరగా జరుగుతున్నాయి. కావున అనంతపురం జిల్లాలో గుంతకల్లులో, అనంత^పురంలో, కూడేరులో ఇతర అన్ని ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు అర్హులైన వారికి ఇవ్వాలని జగనన్న కాలనీల్లో ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణ, మండల సీనియర్ నాయకులు ముట్టాల శ్రీరాములు, మల్ల రాయుడు, కాసిం, వెంకటేశులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి నాయకుల వినతి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 20, నాలుగు వార్డులలో తాగునీరు, డ్రైనేజీ,రోడ్లు విద్యుత్తు సమస్యలు నెలకొని ఉన్నాయని వాటిని పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూర చేయాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డిని ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ వన్నప్ప, వార్డు సభ్యులు ఓబులమ్మ,భాగ్యమ్మ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిశారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు వేగవంతంగా చేపట్టారని తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు ఉన్నప్పటికీ వర్షం వస్తే రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంటుందని తక్షణమే రోడ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి కలెక్టర్, జెడ్పి సీఈవోతో మాట్లాడి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేని కలిసిన వారిలో వైసీపీ నాయకులు ఓబులేసు, గాదిలింగ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెతో 900 గ్రామాలకు తాగునీటి కష్టాలు

విశాలాంధ్ర-ఉరవకొండ: సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సమ్మెకు దిగడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 900 గ్రామాలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి కార్మికులకు రావలసిన ఐదు నెలల జీతాలు, మరియు పిఎఫ్ ఇవ్వాలని కార్మికులు గత 18 రోజులుగా రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. అయినప్పటికీ ప్రభుత్వం గానీ కాంట్రాక్టర్లు గానీ వారి సమస్య పరిష్కారానికి ముందుకు రాకపోవడంతో శుక్రవారం నుంచి వారు సమ్మెలోకి దిగారు ఉరవకొండ నియోజకవర్గం లో 57 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది దాదాపు 572 మంది కార్మికులు, 16 మంది సూపర్వైజర్లు ప్రజలకు తాగునీటిని అందించేందుకు నిరంతరము కష్టపడుతున్నారు అయినప్పటికీ ప్రభుత్వం కార్మికుల యొక్క సమస్యల పరిష్కారానికి ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు ఐదు నెలలకి సంబంధించి 6.25 కోట్ల రూపాయలు కార్మికులకు జీతాలుగా రావాల్సి ఉంది కార్మికులకు జీతాలు రాకపోవడంతో వారి యొక్క పిల్లల చదువులు, జీవనం కొనసాగడం కష్టంగా మారి అప్పులపాలవుతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని కార్మికులకు న్యాయంగా రావలసిన జీతాలు మరియు పిఎఫ్ తక్షణమే విడుదల చేసి కార్మికుల యొక్క కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు సమ్మెబాట పట్టడంతో గ్రామస్తులు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు.

పంటలు కాపాడుకుందాం ..

విశాలాంధ్ర-శెట్టూరు: ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ద్వారా పంటలు కాపాడుకోవాలని ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా మండల వ్యాప్తంగా అయ్యగార్లపల్లి, ఐదు కళ్ళు, తిప్పన పల్లి, చెర్లోపల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎఫ్ ఎకాలజీ అధికారి రమేష్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ కింద వర్షాధారంలో వేరుశనగ, కంది, ఆముదము, చిరుధాన్యాలు పంటలను ప్రకృతి వ్యవసాయం పద్ధతుల ద్వారా రైతులు వేసుకున్నారన్నారు. పూత పిందే కంకి దశలో ఉన్నాయని, గత నెల రోజులుగా కాలంగా వర్షాలు రాకపోవడంతో ఎలాగైనా పంట రక్షించుకోవాలనే ఉద్దేశంతో ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ఏర్పాటు చేసిన స్వస్థ మిత్ర సంఘాలు పంటలకు రక్షతలను ఇచ్చుకోవడంపై అవగాహన సదస్సు ఏర్పాటు ఏర్పాటు చేశామని తెలియజేశారు.

బళ్లారిలో గల్లంతై ఉంతకల్లు వద్ద శవమై తేలాడు



విశాలాంధ్ర బొమ్మనహాళ్: బళ్లారిలోనే హెచ్‌ఎల్సీ కాలువలో సరదాగా ఈత కోసం వెళ్లి ఓ బాలుడు గురు వారం గల్లంతయి శుక్రవారం బొమ్మనహాల్ మండలం ఉంతకల్లు వద్ద శవమై తేలాడు. బళ్లారి రూరల్ ఏ ఎస్ఐ హనుమంతప్ప, మృతుడు బంధువులు తెలిపి వివరాల మేరకు బళ్లారి పట్టణంలోని మీల్లార్ పేటకు చెందిన సాజిదాబాను, దంపతుల కుమారుడు నవాజ్ (15) గుగ్గిరిహట్టి కి చెందిన ఫరూక్ ఇద్దరు కలిసి గురువారం గుగ్గిరిహట్టి సమీపంలోని హెచ్‌ఎల్సీ కాలువలో ఈత కోసం వెళ్లారు. నవాజ్ గల్లంతు కావడంతో ఫరూక్ వెంటనే బళ్ళారి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, పోలీసులు గాలించారు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని ఉంతకల్లు గ్రామ శివారులోని హెచ్ ఎల్ సి ఒకటవ డిస్ట్రిబ్యూటీలో శవమై కనిపించాడు స్థానికులు గమనించి గాలిస్తున్న బళ్లారి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బళ్లారి రూరల్ పోలీసులు, బంధువులు నవాజ్ వెలికితీసి పోస్టుమార్టం కోసం తరలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తండ్రి దాదాపీరా కొంత కాలంగా పక్షవాతం తో ఇంట్లోనే ఉంటున్నాడు. మృతుడు స్టైల్స్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. ఒక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

శింగనమలను కరువు మండలంగా ప్రకటించాలి

- ఎండిపోతున్న పంటలను కాపాడండి
- తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి...
- ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-శింగనమల: తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండల వ్యాప్తంగా వేరుశనగ ,కంది, సజ్జ, జొన్న పత్తి ,పెసర, అలసంద పూర్తిగా ఎండిపోతున్నాయని , శింగనమల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. శుకవ్రారం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్ప యాదవ్, సిపిఐ శింగనమల మండల కార్యదర్శి తరిమెల రామాంజనేయులు రైతు సంఘం నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు మధు యాదవ్, రాము, బృందం ఆధ్వర్యంలో సలకం చెరువు, చిన్నమట్ల గొంది, పెద్దమట్ల గొంది, గ్రామాల రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నప్ప ఎదవ మాట్లాడుతూ రైతులను ఆదుకోకపోతే వలసలు వెళ్లి ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎండిపోయిన పంట పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి రైతులను కాపాడాలని ఈనెల 28వ తారీఖున సోమవారం జిల్లా వ్యాప్తంగా రైతు సమస్యలపైఅన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల దగ్గర నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 లక్షల హెక్టార్లలో వేరుశనగ, పత్తి ,కంది ,జొన్న, కొర్ర, ప్రొద్దుతిరుగుడు, సజ్జ , తదితర పంటలు సాగు చేయడం జరిగినది ఖరీఫ్‌లో వేరుశెనగ పంట వేసీ దాదాపుగా రెండు నెలలు కావస్తుంది, వేసినప్పటి నుండి వర్షం లేక వేసిన అన్నిరకాలపంటలు ఖరీఫ్లో ఎండిపోతున్నాయి వేరుశనగ 30 రోజుల్లోనే పూత దశ 45 రోజులకి ఊడ దశ చేరుకుంటుంది కానీ ఇప్పటికే 45 రోజులు దాటిపోయింది కానీవర్షంలేకపూర్తిగాఎండిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గ్రామస్థాయిలో ఎండిపోయిన పంట పొలాలు పరిశీలించి ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు పంపాలని డిమాండ్ చేశారు రైతులుకుళ్ళాయప్ప, నాగబయన్న, రాజు, తాతయ్య, బయన్న, సూర్యనారాయణ ,రాజేంద్ర, ముత్యాలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 26, ఆగస్టు 2023

వాడవాడలా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర -బత్తలపల్లి: వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక వడ్డెర వీధిలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో హెూమం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గంటాపురంలో ఉన్న గంగమ్మ, ఎల్లమ్మ, బత్తలపల్లిలోని శ్రీ లలిత త్రిపుర సుందరికి పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి పూజలు నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

విశాలాంధ్ర-ధర్మవరం.. : పట్టణంలోని పలు దేవాలయాలలోనూ, ఇళ్లల్లోనూ శుక్రవారం ఘనంగా వరలక్ష్మి వ్రతం వేడుకలను జరుపు కున్నారు. ఇందులో భాగంగా పట్టణం లోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో దాదాపు 60 మంది సామూహికంగా మహిళలు వరలక్ష్మి వ్రత పూజలను జరుపుకున్నారు. ఈ పూజలను అర్చకులు భాను ప్రకాష్, మకరంద బాబు, కోనేరాచార్యులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఈ వ్రత వేడుకలను నిర్వహించుకున్నారు. అనంతరం వరలక్ష్మి వ్రతం యొక్క కథను, ప్రాధాన్యతను భక్తాదులకు తెలియజేశారు. అదేవిధంగా కే పిటి వీధిలో గల వాసవి గుడిలో కూడా ఆర్యవైశ్య సంఘము, వాసవి మహిళా సంఘము, ఆలయ కమిటీ, ఆర్యవైశ్య యువజన సంఘం,వాటి అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. దాదాపు 50 మంది మహిళలచే వరలక్ష్మి వ్రత పూజలతో పాటు కథను కూడా వినిపించారు వినిపించారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. తదుపరి తీర్థ ప్రసాదాలతో ఈ వేడుకలు ముగిశాయి.

గాజుల అలంకరణలో పెద్దమ్మ తల్లి దర్శనం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సాలే వీధిలో గల పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాసం వరలక్ష్మీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం బుగ్గ వంశస్తులచే గాజులతో ప్రత్యేక అలంకరణను అర్చకులు వెంకటేష్ శర్మ ద్వారా గావించి భక్తాదుల కు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు పంచామృతము అభిషేకం విశేష మంగళ ద్రవ్యాలతో అభిషేకమును గావించారు. అనంతరం వందలాదిమంది మహిళలచే లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అమ్మవారికి అలంకరింపజేసిన గాజుల అలంకరణ భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

30వ తేదీ నాటికి జగనన్న కాలనీలు సిద్ధం చేయండి

● మల్లాపల్లి జగనన్న లేఅవుట్‌లో సామూహిక గృహ ప్రవేశాలు చేయాలి..: కలెక్టర్ అరుణ్ బాబు

విశాలాంధ్ర-గోరంట్ల: ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి సామూహిక గృహప్రవేశాలను చేపట్టనున్న నేపథ్యంలో జిల్లాలోని గోరంట్ల మండలం లోని మల్లాపల్లి లేఔట్ నందు సామూహిక గృహప్రవేశాలకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు, శుక్రవారం మల్లాపల్లి జగనన్న లేఅవుట్ నందు హౌసింగ్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ...మల్లాపల్లి జగనన్న లేఅవుట్ నందు ఈ నెల 30న సామూహిక గృహ ప్రవేశాలకు వివిధ దశలలో ఉన్న గృహాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని తెలిపారు. అన్ని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు, మ్యాజిక్ సోక్ పిట్ ల ఏర్పాటు, కాలనీ అంతర్గత రోడ్లు, నీటి వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, కాలనీ ముఖ ద్వారం వద్ద ఆర్చి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎక్కడా జాప్యం ఉండరాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ ఈ. గోపాల్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్ ఖాన్,డ్వామా పిడి రామాంజ నేయులు, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, జడ్పిటిసి పాలే జయరామ్ నాయక్, ఎంపీపీ ప్రమీల మూర్తి, సర్పంచ్ శివానంద, ఆర్డబ్ల్యూస్ ఏఈ ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సదస్సును విజయవంతం చేయండి

● సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు

విశాలాంధ్ర-ధర్మవరం: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సెప్టెంబర్ 5వ తేదీన ఏర్పాటుచేసిన చేనేత సదస్సును విజయవంతం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కదిరి గేటు వద్ద గల నేతన్న విగ్రహం దగ్గర కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మధు మాట్లాడుతూ చేనేత సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలను ఉధృతం చేస్తామని, చేనేత కార్మికులను చేనేత పరిశ్రమను పరిరక్షించుకుం టామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, చేనేత అడ్వైటైజర్ బోర్డు పునరుద్దించాలని, మహాత్మా గాంధీ రుణకర యోజన పథకం అమలు చేయాలని, చేనేతపై పూర్తిగా జీఎస్టీని రద్దు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, చేనేత వస్త్రాల అమ్మకాలపై 20 శాతం రిబేట్ పునరుద్ధరిం చాలని, హెల్త్ స్కీం అమలుచేయాలని, నూలుతోపాటు పట్టుపై కూడా 40 శాతము సబ్సిడీని కొనసాగించాలని, కేంద్ర బడ్జెట్లో చేనేత రంగానికి 25 వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. తెలిపారు. ఈ కార్యక్రమం లో చేనేత సంఘం నాయకులు వెంకటస్వామి, వెంకటనారాయణ, రవికుమార్, రమణ, చెన్న బుజంగం, చెన్నంపల్లి శ్రీనివాసులు, శ్రీధర్, శివ, శ్రీనివాసులు, బాలరంగయ్య, సురేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దయమని పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. కోడపగానిపల్లె తిరుమల దేవరపల్లి, మైలేపల్లి గ్రామాలలో శుక్రవారం ఆయన గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారులు. ప్రతి ఇంటికీ తిరిగి నాలుగున్నర సంవత్సరంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుకుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం టిడిపి నుండి వైసీపీలోకి బోయ గోపాల్, నారాయణస్వామి, చంద్రశేఖర్, మంగళ ప్రసాద్ వారికి కండువా చేసి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సింగల్ విండ్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, సర్పంచులు అలివేలమ్మ కేశవరెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పిటిసి గంగాదేవి శంకర్, ఎంపీటీసీ కృష్ణవేణి, వైసిపి నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, ధనుజయ, రామన్న, దాల్మిల్ సూరి, భాస్కర, తాహసిల్దార్ రామాంజనేయ రెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ ఓబులేసు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

▸ పంట రుణాలను మాఫీ చేయాలి ఏపీ రైతు సంఘం

విశాలాంధ్ర-తనకల్లు: మండల పరిధిలోని తిరుమలయ్య గారి పల్లిలో మూడు ఎకరాల్లో కౌలు రైతు శివన్న సాగుచేసిన వేరుశనగ పొలాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవి రమణ, జిల్లా నాయకులు మధు, రైతు సంఘం బృందం శుక్రవారం పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటలన్నీ వర్షం లేక ఎండిపోతున్నాయని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి ఒక పదును వర్షం కూడా పడలేదని, రైతుల బాధలను అర్థం చేసుకొని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా కాలువకు నీటిని వదిలి సిజి ప్రాజెక్టుకు లింకు కాలువ ఏర్పాటు చేసి నింపితే నీటి కరువు సమస్య తీరుతుందన్నారు. పశువులకు గడ్డి పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇన్సూరెన్స్ తో పాటు ఇన్పుట్ సబ్సిడీ రైతులకు అందజేసి ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఇక్బాల్, సిపిఐ మండల కార్యదర్శి రెడ్డప్ప, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్ప యాదవ్, రైతు సంఘం జిల్లా నాయకులు కరీముల్లా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ..

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల పరిధిలోని తిరుమల దేవరపల్లి గ్రామానికి చెందిన కమ్మర గాయత్రి నాగ మోహన్ విద్యార్థులకు సత్యసాయి భక్తురాలు రెండు సైకిళ్లను అందించడంతో డీఈవో కార్యాలయం వద్ద ఏడి నాగరాజు వాటిని పంపిణీ చేశారు. ఈ విద్యార్థులు కోడపగానిపల్లి ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నందున అక్కడికి వెళ్లడానికి ఇబ్బంది అవుతున్నందున ఉపాధ్యాయులు సత్యసాయి భక్తురాలు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయచంద్ర, హెచ్ఎం చలపతి, ఉపాధ్యాయులు ప్రసాదు పాల్గొన్నారు.

శ్రీ కాశి నాయన ఆశ్రమానికి విరాళం

విశాలాంధ్ర-ధర్మవరం: గరుడంపల్లి వద్ద గల శ్రీ కాశీనాయన ఆశ్రమంలో నూతన వంటశాల నిర్మాణం కొరకు ధర్మవరం పట్టణ చేనేత ప్రముఖులు తమ వంతుగా నగదు విరాళాలను శుక్రవారం అర్చకులు, కమిటీ వారికి అందజేశారు ఇందులో భాగంగా నగదు విరాళాలు ఇచ్చిన వారిలో చేనేత ప్రముఖులు సిద్ధి రాజేష్ రూ.50,116, కాచర్ల అంజి రూ.20,000, బొమ్మిశెట్టి బాలరాజు రూ.15,000, చింతా మారుతి రూ.5,000, చింతా వాసు రూ.5,000, డెకరేషన్ కృష్ణ రూ.5,000లను ఇవ్వడం జరిగింది. అనంతరం ఆశ్రమం నిర్వాహకులు దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

చంద్రయాన్-3 విజయవంతం కావడం గర్వకారణం

▸ జడ్జీలు గీతావాణి, శివ పార్వతి, మురళి

విశాలాంధ్ర-ధర్మవరం: మిషన్ చంద్రయాన్ 3 ద్వారా చంద్రుడి మీద విక్రం సేఫ్ లాండింగ్ కావడం మన భారతీయులందరికీ గర్వకారణమని సీనియర్ సివిల్ జడ్జ్ గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జ్ శివపార్వతి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మురళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి లాయర్లు, జడ్జీలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్జీలు విచ్చేసి, ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని వారు వివరించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్బారావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సతీష్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఎన్నో విజయాలు, అపజయాలను చవి చూడడం జరిగిందని తెలిపారు. నేడు ప్రపంచ దేశాలు అన్నీ కూడా భారతదేశం వైపు చూసే లాగా మన ఇస్రో శాస్త్ర పరిజ్ఞానం రూపొందిం చబడటం సంతోషదాయకం అనాన్నారు. నాలుగేళ్ల 2వేల మంది ఇస్రో శాస్త్రవేత్తలు కష్టపడి చంద్రయాన్ 3 ప్రయోగాన్ని దిగ్విజ యంగా పూర్తి చేసుకొని దేశ మువ్వన్నెల జెండా చంద్రమండలంపై ఎగరడం మనందరికీ గర్వకారణం అన్నారు. మిఠాయిలను పంపిణీ చేశారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సోమందేపలి సీడీపీఓ అనూరాధపై అవినీతి ఆరోపణలు

● రూ.3 లక్షలు తీసుకొని అంగన్వాడీ ఆయాకు వర్కర్‌గా పదోన్నతి ఇచ్చినట్లు కలెక్టర్, ఆర్డీడీకి ఫిర్యాదు ● విచారణకు ఆదేశం

విశాలాంధ్ర-గోరంట్ల: సోమందేపలి సీడీపీఓ అనూరాధపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి, సోమందేపల్లి ప్రాజెక్టు పరిధిలోని గోరంట్ల మండలం వానవోలులో ఆయాకు పదోన్నతి వివాదాస్పదంగా మారింది, ఏకంగా రూ.3 లక్షలు తీసుకొని అంగన్వాడీ ఆయాకు వర్కర్ గా పదోన్నతి ఇచ్చినట్లు కలెక్టర్, ఆర్జేడీలకు సర్పంచ్, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణకు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ కు విచారణాధికారిగా నియామకం చేశారు, అంగన్వాడి టీచర్ సుబ్బ నరసమ్మ మే నెలలో రిటైర్డ్ కావడంతో అంగన్వాడి సెంటర్ లోనే ఆయాగా పనిచేస్తున్న ఎం శోభ కు మూడు రోజుల క్రితం అంగన్వాడీ టీచర్ గా ఆర్డర్ కాపీని ఉన్నతాధికారులు అందజేశారు,అయితే ఆయాగా సరిగా పనిచేయలేని ఆమెకు అంగన్వాడి టీచరుగా ప్రమోషన్ ఇస్తే ఇంకా ఆమె ఏమి పని చేస్తుందని ఆమెపై ఆరోపిస్తూ.. స్థానిక సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు,మండల పరిధిలోని వానవోలు గ్రామము అంగన్ వాడి సెంటరు-1లో పనిచేయుచున్న అంగన్వాడి టీచరు రిటైర్డు అయినందువలన ఆయాగా అంగన్వాడి సెంటర్ లోనే పనిచేస్తున్న ఎం, శోభ అనే ఆమెకు 23 వ తేదీ గత బుధవారం సోమందేపల్లి సి.డి.సి.ఓ. అనురాధ రూ.3 లక్షలు డబ్బులు తీసుకొని అంగన్వాడి ఆయా శోభ ను అంగన్ వాడి టీచరుగా ప్రమోషన్ ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు. కానీ ఆయాగా సెంటర్లో పిల్లలను, బాలింతలను, గర్భవతులను సరిగా చూచుకోవడంలేదని, పలుమార్లు ఈ విషయమై. సి.డి.పి.ఓ.కు పిర్యాదు చేసామని, ఎలాంటి స్పందనలేదని, ఈమెకు ఇచ్చిన ప్రమోషన్ రద్దుపరచి సరైన వారిని అంగన్వాడి టీచరుగా నియమించాలని గ్రామ సర్పంచ్ శ్రీరాములు, గ్రామస్తులు కోరారు. విషయంపై కలెక్టర్ అరుణ్ బాబు స్పందించి వెంటనే సి.పి.డి.ఓతో పిలిపించి, విచారణ చేపట్టాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ కు అదేశించారు. ఈ విషయంపై సిడిపిఓ అనురాధను వివరణ కోరగా.. గత రెండేళ్ల నుండి అయగా శోభ పనిచేస్తుందని, ఎలాంటి సమస్య లేదని అయితే అన్ని అర్హతలు ఉండడంతో పాటు గత మే నెలలో అంగన్వాడీ టీచర్ సుబ్బ నరసమ్మ రిటైర్డ్ కావడంతో పాటు ఆయా తనకు టీచర్ ప్రమోషన్ కావాలని కలెక్టర్ గ్రీవెన్స్ కూడా వెళ్లిందని దీంతో ఆమెకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత మూడు రోజుల క్రితం అంగన్వాడీ టీచర్ గా ప్రమోషన్ ఇస్తూ ఆర్డర్ కాపీ ఇచ్చామని, ఎవరు ఎవరికి డబ్బులు ఇవ్వలేదని అనవసరంగా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

జిల్లాకు ఈవీఎంస్ కంట్రోల్ యూనిట్ పరికరాలు : ఆర్డీఓ

విశాలాంధ్ర-ధర్మవరం: వచ్చే ఎన్నికల కొరకు, రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి బెంగళూరు భారత్ ఎలక్ట్రానిక్స్ నుండి కొత్తగా తయారు చేసిన 400 కంట్రోల్ యూనిట్లను శ్రీ సత్య సాయి జిల్లాకు కేటాయించారని, వాటిని ఎస్కార్ట్ ద్వారా ధర్మవరం పట్టణంలోని మార్కెట్ యార్డులో గోడౌన్లో భద్రపరిచామని ఆర్డీవో తిప్పే నాయక్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు, డి ఆర్వో కొండయ్య, జిల్లా ఉన్నతాధికారులు విచ్చేసి, వాటి వివరాలు గూర్చి అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. గోడౌన్ నెంబర్ 8 అండ్ 9 అండ్ 5 లలో కేటాయిస్తూ, ఎన్నికల కమిషన్ యొక్క నియమ నిబంధనల మేరకు మరమ్మత్తులను చేసి వాటిని భద్రత దృష్ట్యా స్టోరేజ్ కోసం వివిధ రాజకీయ పార్టీ నాయకుల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్,డిఆర్ఓ, ఆర్డీవో, ఇతర అధికారుల సమక్షంలో భద్రపరిచి, సీజ్ వేయడం జరిగిందని తెలిపారు. రిజల్ట్ ఆర్మీ పోలీస్ సిబ్బంది పహారా ఉంటుందని చెప్పారు. ఇంకా 4,800 వివిపిటిఎస్, 4400 బ్యాలెట్ యూనిట్లు రావాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో యుగేశ్వరి దేవి, ఆర్ అండ్ బి అధికారులు, విద్యుత్ అధికారులు, డిఎస్పి శ్రీనివాసులు, డిప్యూటీ ఎలక్షన్ తాసిల్దార్ అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు రూ.3 లక్షలు !

▸ కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు ▸ విచారణ చేపట్టిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-పెనుకొండ : అంగన్వాడి ఆయా స్థాయి నుంచి కార్యకర్త స్థాయికి ఉద్యోగన్నతి పొందేందుకు సిడిపిఓ కు రూ.3 లక్షలు ఇచ్చారని ఆరోపిస్తూ గోరంట్ల మండలం వానవోలు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం విచారణ చేపట్టారు. గోరంట్ల మండలం వానవోలు1 అంగన్వాడి కేంద్రంలో మే నెలలో కార్యకర్త పదవీ విరమణ పొందారు. దీంతో ఆయాగా పనిచేస్తున్న శోభాను అంగన్వాడి కార్యకర్తగా తీసుకునేందుకు సిడిపిఓ అనురాధ జిల్లా అధికారులకు నివేదిక పంపారు. అన్ని విధాల అర్హత ఉందని శోభాను కార్యకర్తగా తీసుకోనేందుకు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ శ్రీరాములు తో సహా మరికొందరు గ్రామ ప్రజలు అక్రమ మార్గంలో సిడిపిఓ రూ. 3 లక్షలు తీసుకొని శోభకు కార్యకర్త పోస్ట్ ఇచ్చారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ కు గురువారం ఫిర్యాదు చేశారు. నోటిఫికేషన్ ఇచ్చి కార్యకర్త పోస్టు భర్తీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సిడిపిఓ అనురాధ, అంగన్వాడీ కార్యకర్త శోభలను సబ్ కలెక్టర్ విచారించారు.

నిబంధనల ప్రకారం కార్యకర్తగా ఎంపిక చేసాం: సిడిపిఓ నిబంధనల ప్రకారమే శోభాను అంగన్వాడి కార్యకర్తగా ఎంపిక చేసామని సిడిపిఓ అనురాధ ఉన్నారు. గ్రామంలో విచారణ చేశామని, తల్లుల కమిటీ తీర్మానం చేశారని అన్నారు. మూడు లక్షల తీసుకొని కార్యకర్త పోస్ట్ ఇచ్చామనడం బాధాకరం అన్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడ లేదని సిడిపిఓ తెలిపారు.

పేదలకు వైద్యం అందించడంలో ఎంతో తృప్తి ఉంది..

క్యాంపు చైర్మన్ దాసరి వెంకటేశులు (చిట్టి)

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు వైద్యం అందించుటలో ఎంతో తృప్తి ఉందని క్యాంపు చైర్మన్ దాసరి వెంకటేశులు(చిట్టి), దేవాలయ అభివృద్ధి సంఘం అధ్యక్షులు బంధనాదం రమణ, కార్యదర్శి సిరివెళ్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు బండి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ ఆదివారం పట్టణంలోని తొగటవీధిలో శ్రీ శాంత కళ చౌడేశ్వరి దేవాలయం యొక్క ఆవరణములో 90వ ఉచిత వైద్య చికిత్స శిబిరమును నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నిష్ణాతులైన డాక్టర్లు వివేకుళ్ళయప్ప, వెంకటేశ్వర్లు, సాయి స్వరూప్, లతాశ్రీ, నాగప్రసాద్ అనే వైద్యులచే ఉచిత వైద్య చికిత్సలను, ఉచిత ఆరోగ్య సలహాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు రెడ్డివల్లి సుబ్బమ్మ, కీర్తిశేషులు రెడ్డివల్లి రామప్ప జ్ఞాపకార్థం వీరి కుమారుడు ఆర్. రామచంద్ర, ఆర్.రాజేశ్వరి, ఆర్.సాయి మనోజులు వ్యవహరించనున్నారని తెలిపారు. గతంలో వైద్యులు ఇచ్చిన రిపోర్టులు కూడా తీసుకొని రావాలని తెలిపారు. వైద్య చికిత్సలను అందించడంతో పాటు నెలకు సరిపడా మందులను కూడా దాతలు చేతులు మీదుగా ఇవ్వడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. కావున పట్టణ, గ్రామీణ పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు జీతాలు మంజూరు చేయండి

విశాలాంధ్ర-తనకల్లు: ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు స్వచ్ఛభారత్ కార్మికులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. జిల్లా సెక్రెటరీ రమేష్ హాజరై మాట్లాడుతూ దాదాపు పది నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును జిల్లాల అమలు చేయాలని టెండర్‌తో సంబంధం లేకుండా కార్మికులను కొనసాగించాలని, కనీస వేతనం 21000 ఇవ్వాలని రాజకీయ వేధింపులు ఆపాలని, కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు ఏమన్నా, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం జిల్లా సభ్యులు వివి రమణ, పంచాయతీ కార్మికులు రమణ, గంగాధర, శ్రీనివాసులు, ఆంజనేయులు, అంజి, శివన్న పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా శంకరన్న

- 45 మందితో నూతన కమిటీ

విశాలాంధ్ర-పెనుకొండ: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో భాగా పనిచేసేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలను ప్రకటించింది శ్రీ సత్య సాయి జిల్లాకు సంబంధించి 45 మంది సభ్యులతో కూడిన జాబితాను ప్రకటించారు పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ కు మరోసారి పార్టీ పగ్గాలు అప్పగించారు శంకర్ నారాయణ బిసి వర్గానికి చెందిన వ్యక్తి హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన కురుబ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయనను పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ కమిటీలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు నియోజకవర్గాల నుంచి అన్ని సామాజిక వర్గాలు కలుపుకొని కొత్త కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు, పార్టీ కన్వీనర్లు, జెడ్పిటిసిలు, ఇతర కార్యవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ మండలం ఐసిడిఎస్ సిడిపిఓ శాంతిలక్ష్మి, అదే డిపార్ట్మెంట్ అధికారి 15ఆగష్టు ఉత్తమ అధికారులుగా ప్రశంస అవార్డు పొందిన సందర్భంగా ఎండిఓ ఆఫీస్ మీటింగ్ హాల్ నందు ఎండిఓ శివశంకరప్ప అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఈ కార్యక్రమానికి బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు , హైకోర్టు, న్యాయమూర్తి శివరామకృష్ణ ముఖ్య అధితిగా విచ్చేసి వీరిని సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. సన్మాన గ్రహీతల గురుంచి మాట్లాడుతూ మహిళా సాధికారిత సాధించడానికి విశేష కృషి చేసూన్న వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శెట్టిపల్లి నరసింహులు, రామాంజినేయులు, కౌన్సిలర్ శేషాద్రి,రామకృష్ణ సుధాకర్, నరసింలు, మూర్తి, గంగప్ప, తరుపున నరసింలు పాల్గొన్నారు.

ఓటర్ సర్వే పక్కాగా నిర్వహించాలి : ఆర్డిఓ

విశాలాంధ్ర-నల్లచెరువు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంగం ఆదేశాల మేరకు ఇంటింటా ఓటర్ సర్వే పక్కాగా నిర్వహించాలని కదిరి ఆర్డీవో రాఘవేంద్ర పేర్కొన్నారు. .శుక్రవారం మండల పరిధిలోని స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో కార్యాలయంలో బిఎల్వోలు వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ సర్వేలో దివ్యాంగులను ఫార్మ్8 ద్వారా వారి వివరాలను సేకరించండి అలాగే 1954 -2003 వరకు అసైన్ భూములను వీలైనంత త్వరగా గుర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో డిప్యూటీ తాహసిల్దార్, ఎలక్షన్ డిప్యూటీ తాహసిల్దార్ ముకుంద, ఆర్ ఐ అశోక్ కుమార్, వీఆర్వోలు ఓబులేసు, జ్యోతి, ఇమ్రాన్, రబ్బాని, ముబారక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ సర్కిల్ సీఐగా యతీంద్ర

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ సర్కిల్ సీఐగా యతీంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐ విఆర్ కు వెళ్లగా, ఆ స్థానంలో శ్రీ సత్యసాయి దిశా పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై ముదిగుబ్బ సర్కిల్‌కు వచ్చినట్లు తెలిపారు. సిఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వారి సమస్యలను తెలియజేయవచ్చని సీఐ తెలిపారు.